మురికి కూపం.. బుడగజంగం బస్తీ!

- మురుగు మధ్యే జీవితాలు వెళ్లదీస్తున్న బస్తీవాసులు
- ఇరుకు గదులు.. గుడిసెల్లోనే నివాసాలు
- ద్విచక్రవాహనం కూడా పట్టనంత ఇరుకు దారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఖైరతాబాద్ బుడగజంగం బస్తీపై ప్రత్యేక కథనం

ఖైరతాబాద్, అక్టోబర్ 14 : ప్రభుత్వం.. జీహెచ్ఎంసీ రికార్డుల్లో ఉన్న బస్తీ అది.. జనాభా లెక్కల్లో ఉన్న మనుషులు వారు.. ప్రతి ఐదేండ్లకోసారి ఓటు హక్కును సైతం వినియోగించుకుంటుంటారు. అయినప్పటికీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల చిన్న చూపు.. అధికారుల నిర్లక్ష్యం.. వెరసి నగర నడిబొడ్డున

ఇంటి చుట్టూ చేరిన డ్రైనేజీ నీటి మధ్యే కాలకృత్యాలు తీర్చుకుంటున్న బస్తీవాసులు

50 ఏండ్ల వెనక్కి నెట్టేసినట్లుగా మురుగు, దుర్గంధం మధ్య.. జీవనం. గుడిసెలు, శిథిల భవనాల్లో.. రోగాల బారిన పడుతూ జీవశ్చావాల్లా మారి బతుకీడుస్తున్నారు ఖైరతాబాద్ డివిజన్‌లోని బుడగజంగం బస్తీ వాసులు.

ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రస్తుతం కాంక్రీట్ జంగిల్‌గా మారింది.ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు దర్శనమిస్తున్నాయి. వాటి మధ్యలో ఓ మూలకు నెట్టి వేసినట్లు ఉండే బుడగజంగం బస్తీ ప్రజల దుస్థితిపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

వందకు పైగా కుటుంబాలు.. రెండే ఇరుకు దారులు

బుడగజంగం బస్తీల్లో నిరుపేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలే ఉంటారు. వీరిలో ఎక్కువ శాతం ప్రజలు ఇతర ప్రాంతాల్లో ఇండ్లల్లో పాచిపని, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. సుమారు వందకు పైగా కుటుంబాలు జీవిస్తున్నా.. వారి బాగోగులు పట్టించుకునే నాథుడే కరువయ్యారు.. ఎవరికైనా జబ్బు చేస్తే అత్యవసర పరిస్థితుల్లో 108, అంబులెన్స్‌లను రప్పించాలి. అయితే బస్తీలోకి కనీసం అంబులెన్స్ వెళ్లే దారి కూడా లేదు. రెండే రెండు ఇరుకు దారులున్నాయి. అందులో కనీసం బైక్ కూడా పూర్తిగా వెళ్లలేని దుస్థితి. అసలే దారులు లేవంటే.. బస్తీ మధ్యలో ఏర్పాటు చేసిన కల్లుదుకాణం తమకు శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖైరతాబాద్ డివిజన్‌లోని బుడగజంగం బస్తీ

జీహెచ్ఎంసీలోని ఏ విభాగం పట్టించుకోదు..

వర్షాకాలం వచ్చిందంటే ఆ బస్తీ వాసుల వెన్నులో వణుకు పుడుతున్నది. జీహెచ్ఎంసీలో పారిశుద్ధ్య విభాగం ఈ బస్తీవైపు కన్నెత్తి చూడదు.. డ్రైనేజీ, సివరేజీ లైన్లు సరిచేయాల్సిన ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోరు.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఎంటమాలజీ వారు ఇటు వైపు రారు. డెంగీ, చికున్‌గున్యాతో ప్రభుత్వ దవాఖానలకు పరుగులు పెడుతున్నా వైద్య విభాగం కనికరం చూపదు.. వీది కుక్కలు చిన్నపిల్లలపై గుర్రుగా చూస్తున్నా వెటర్నరీ విభాగం చర్యలు తీసుకోదు.. చివరకు రక్షిత మంచినీరు సరఫరా చేయాల్సిన జలమండలి అధికారులు పట్టించుకోక నల్లా నీటిలో మురుగునీరు వస్తున్నదని బస్తీవాసులు వాపోతున్నారు.

బస్తీలో సరైన డ్రైనేజీ సౌకర్యం లేదు..

40 ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. పాలకులు మారినా మా తలరాతలు మారడం లేదు. వానకాలంలో డ్రైనేజీ నీరు మొత్తం ఇండ్లలో చేరుతున్నా అధికారులు రారు.. ప్రజాప్రతినిధులు పట్టించుకోరు. సంవత్సరాల తరబడి క్యాచ్‌పిట్లు, డ్రైనేజీ లైన్లలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయినా శుభ్రం చేసిన సందార్భాలు లేవు. బస్తీ మొత్తానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. బస్తీకి కొద్ది దూరంలో డ్రైనేజీ పైపులైన్ ఉన్నా అందులో కలపరు. రోగాలతోనే జీవితాలను వెల్లదీస్తున్నాం. – వెంకటేశ్, బుడగజంగం బస్తీ

రోడ్డు మంజూరైనా వేయలేదు..

బుడగజంగం బస్తీ పేరుకే ఉంది. మా బాధలెవరూ పట్టించుకోరు. తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తున్నది. స్ట్రీట్ లైట్స్ వెలగవు. రాత్రి వేళల్లో సెల్‌ఫోన్ లైట్లే దారి చూపిస్తాయి. బస్తీ దారుల్లో ఒక్క వాహనం కూడా లోపలికి వెళ్లదు. మా బస్తీకి అసలు రోడ్డే లేదు. గతంలో బస్తీకి రోడ్డు మంజూరైనప్పటికీ వేయలేదు. అధికారులను ప్రశ్నిస్తే సమాధానం దొరకదు. ఇక్కడ ఒక బస్తీ ఉందని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలి. – భూలక్ష్మి, బుడగజంగం బస్తీ

మమ్మల్నెవరూ పట్టించుకోరు.. మాకు దిక్కెవరు?

భారీ వర్షాలు కురిసినప్పుడు మా బాధలు వర్ణణాతీతం. బస్తీ మొత్తం మోకాల్లోతు నీరు చేరినా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులెవరూ కన్నెత్తి చూడకపోవడంతో రోజుల తరబడి నీరు అలాగే నిలిచిపోతున్నది. ఓ వైపు దుర్గంధం, మరో వైపు దోమలు, ఈగలు విజృంభిస్తాయి. వరదలు వచ్చినప్పుడు బంధువుల ఇంట్లో తలదాచుకుంటాం. వర్షాలు తగ్గిన తర్వాత ఇంటికో వంద రూపాయలు ఇచ్చి నీటిని తాత్కాలికంగా తొలగించుకుంటున్నాం. మాకు దిక్కెవరు. సొంత ఇళ్లు లేదు. మా కుటుంబమంతా 30 ఏండ్లుగా కిరాయి ఇండ్లల్లోనే ఉంటున్నాం. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎలక్షన్‌కు ముందు ఒక్కరోజు మాత్రమే కనిపిస్తారు. ఆ తర్వాత కన్నెత్తి చూడరు. ఇక కార్పొరేటర్‌ను చూసి చాలా రోజులైంది. – మాధవి, బుడగజంగం బస్తీ

మా బస్తీకి సుస్తీ చేసింది..

గత నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మా బస్తీకి మొత్తం సుస్తీ చేసింది. ఖైరతాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోతే జబ్బు తగ్గలేదు. పరీక్షలు చేస్తే అదేదో డెంగీ, చికున్ గున్యాలు అని డాక్టర్లు చెప్పారు. మా పిల్లలకు వైరల్ ఫీవర్లు వచ్చాయి. కష్టం చేసిన డబ్బులు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్ దవాఖానలో ట్రీట్‌మెంట్ తీసుకున్నాం. మున్సిపాలిటీ వారు డ్రైనేజీలు సాఫ్ చేస్తలేరు. కంప్లయింట్ ఇస్తే పట్టించుకోవడం లేదు. – సాయి నరేశ్, బుడగజంగం బస్తీ

ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

బండ్లగూడ,అక్టోబర్ 14 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణికి రెండు వినతులు రావడంతో వాటిని సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయండి..

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14: గుంతల రోడ్లపై నడవలేకపోతున్నామని, అధికారులు మరమ్మతు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నాయకుడు సురెడ్డి వినయ్‌రెడ్డి కోరారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉపకమీషనర్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. గగన్‌పహాడ్‌లో రోడ్డు సరిగ్గా లేదని పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, దాంతో దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మారగోని శివకుమార్, సామ రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీ బలం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు రఘుయాదవ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ యువజన అధ్యక్షుడు రఘుయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్‌ను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు.కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాముయాదవ్, అరుణ్, రాజేశ్‌యాదవ్, మైసాయిరెడ్డి, సురేశ్‌ముదిరాజ్, శ్రీనాథ్‌యాదవ్, శ్రీకాంత్, భాస్కర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రజలకు కష్టాలు

- బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి

తనపై రూపొందించిన పాట విడుదల కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ యువ నాయకుడు పటోళ్ల కార్తిక్‌రెడ్డి, అప్పారెడ్డి ముఖేశ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 14: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అత్తాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ ఆధ్వర్యంలో కార్తిక్‌రెడ్డిపై రూపొందించిన పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తన ధ్యేయమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి యువకుల మద్దతు రోజు రోజుకు పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజలు కష్టాలు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రాష్ట్ర బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్ మాట్లాడుతూ.. కార్తిక్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో పాటను రూపొందించామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాముయాదవ్, రఘు, అశోక్‌యాదవ్, శ్రీపాల్, వెంకటేశ్, శశికాంత్, దామోదర్, సంగీత్, రాజు తదితరులున్నారు.

మణికొండలో అలయ్ బలయ్

మణికొండలో నిర్వహించిన అలయ్ బలయ్‌లో పాల్గొన్న నాయకులు, ప్రజలు

మణికొండ, అక్టోబర్ 14: పండుగలను తెలుగుదనం ఉట్టిపడేలా నిర్వహించుకోవడం సంతోషకరమని వీఆర్ 4 చారిటబుల్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో మణికొండ నల్లపోచమ్మ దేవాలయ ఆవరణలో అలయ్ బలయ్ నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పందెన్ వాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయండి..

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు, తదితరులు

మణికొండ, అక్టోబర్ 14: బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సోమవారం మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్ మహ్మద్ మాట్లాడుతూ.. పందెన్ వాగుపై తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయని దాంతో స్పెక్ట్రమ్ విల్లాస్ వాసులతోపాటు చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంకటేశ్వర కాలనీ, స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద పనులు పూర్తి కాకపోవడంతో సమస్య తీవ్రమైందన్నారు. వెంటనే అధికారులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి బొమ్మ ఉపేంద్రనాథ్ రెడ్డి, నర్సింహులు, సందీప్, జస్వంత్, రాజా తదితరులు పాల్గొన్నారు.

18న కల్లుగీత కార్మిక సంఘం వార్షికోత్సవాలు

లోగోను ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ,వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి, అక్టోబర్ 14: కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో 'తెలంగాణ పదేండ్ల ప్రయాణం–కల్లుగీత వృత్తిలో ఉపాధి' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. గీత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు కృష్ణస్వామి, సుధాకర్, ఆంజనేయులు, నరసింహ్మా, లింగం గౌడ్, యాదయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో సెల్‌ఫోన్లు చోరీ

బంజారాహిల్స్, అక్టోబర్ 14: జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధి పెద్దమ్మగుడిలో దసరా సందర్భంగా ఆలయంలో వాహనపూజకు వచ్చిన ఏఎస్ఐ కుటుంబసభ్యుల సెల్‌ఫోన్లను దుండగులు చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోరబండ ప్రాంతంలో నివాసముంటున్న డి.డిల్లేశ్వర్‌రావు ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈనెల 12న దసరా పండుగ రోజున తన కొత్త కారుకు పూజ చేయించేందుకు కుటుంబసభ్యులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడికి వచ్చారు. ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలంలో వాహన పూజ నిర్వహిస్తున్న క్రమంలో భార్య, కుమార్తె సెల్‌ఫోన్లను కారు వెనుకసీట్లో పెట్టారు. పూజ అనంతరం బయల్దేరగా కారు వెనకసీట్లో పెట్టిన ఫోన్లు మాయమైన విషయాన్ని గుర్తించారు. వెంటనే బాధిత ఏఎస్ఐ డిల్లేశ్వర్‌రావు సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

మన్సూరాబాద్, అక్టోబర్ 14: క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. జాతీయ యోగా ఆసన పోటీలకు ఎంపికైన చిన్నారి పూజితను సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సన్మానించారు. అనంతరం ఉప్పల ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూజిత జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, పూర్ణ, డాక్టర్ ఏఆర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పల్లకీ సేవలో కార్పొరేటర్

సికింద్రాబాద్, అక్టోబర్ 14: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పద్మారావునగర్ హమాలీబస్తీలో నల్లపోచమ్మ అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ పాల్గొన్నారు. అంతకుముందు ఆమె అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్, మల్లికార్జున్, గిరిబాబు, నరేశ్ పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

- యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌లో 500 గృహాల్లో పూర్తయిన సర్వే

కుటుంబసభ్యుల వివరాలు సేకరిస్తున్న డీసీ జాకియా సుల్తానా, అధికారులు, సిబ్బంది

జూబ్లీహిల్స్,అక్టోబర్14 : ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు చేయడంతో పాటు ఒక్క కార్డుతో అన్ని సేవలను అందించేందుకు చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పూర్తయింది. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం జీహెచ్ఎంసీ అధికారులు పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనరసింహనగర్‌లో నిర్దేశిత 500 గృహాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. అన్ని సేవలను ఒకే కార్డుపై అందించే ఈ కుటుంబ డిజిటల్ కార్డు కోసం అధికారులు ఇంటింటికీ వెళ్లి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు. ఆధార్ కార్డు ప్రామాణికంగా కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, రేషన్‌కార్డు లేని వారి వివరాలు సేకరించారు. అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించేందుకు ఒక్కో నియోజకవర్గంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ సర్వే చేపట్టారు. సర్వే నివేదికను కమిషనర్‌కు అందజేసినట్లు జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు, ఏఎంసీలు ఎస్వై కమల్, బాల్‌రాజ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది సర్వే నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

పీడీఎస్‌యూ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మధు

అంబర్‌పేట, అక్టోబర్ 14 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఓయూ, కేయూ యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధికంగా కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని, ఈ బంద్‌పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పొడపంగి నాగరాజు అన్నారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో మధు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంద్‌తో మధ్యతరగతి విద్యార్థుల చదువు ఆగమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఒకపక్క డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజులు కట్టి ఎగ్జామ్స్‌కు విద్యార్థులు ప్రిపేర్ అవుతున్న వేళ డిగ్రీ కళాశాలలు బంద్ చేయడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద నవీన్, సహాయ కార్యదర్శులు గుర్రం అజయ్, నరసింహారెడ్డి, కోశాధికారి మామిడాల మహేశ్, కార్యవర్గ సభ్యులు తీగల శ్యామ్, మాదారపు నాగరాజు, మామిడాల ప్రవీణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రూ.50వేల విరాళం

నగదును విద్యార్థులకు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 14: ఎల్బీనగర్ చిత్రాలేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో వసతులు, విద్యార్థుల చదువులకుగాను మన్సూరాబాద్ విజయశ్రీ కాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి తల్లిదండ్రుల వర్ధంతి సందర్భంగా రూ. 50 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమ్మానాన్నలు కోల్పోయి ఎలాంటి ఆధారం లేక అనాథ గృహంలో ఉంటున్న పిల్లలకు తమ వంతుగా సాయం అందించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్లోంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, అక్టోబర్ 14: రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్–లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్య ఓ వ్యక్తి రైల్లోంచి జారి కింద పడడంతో రెండు కాళ్లు పూర్తిగా తెగిపోయి అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయసు సుమారు 25–30 ఏండ్లు ఉంటాయని, తెలుపు, నలుపు రంగు టీషర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

సీఎంకు దసరా శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకు మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. – జూబ్లీహిల్స్, అక్టోబర్ 14

కార్తిక్‌రెడ్డికి శుభాకాంక్షలు

బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పటోళ్ల కార్తిక్‌రెడ్డిని సోమవారం ఆ పార్టీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాముడు యాదవ్, వెంకటేశ్, దుర్గేశ్, నరేందర్, చందు, పెంటయ్య యాదవ్, నర్సింహ, వినోద్, సాయిరెడ్డి, అశోక్, కీర్తి క్రాంత్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ, అక్టోబర్ 14

'దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

సికింద్రాబాద్, అక్టోబర్ 14: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. దేవతా విగ్రహాలను ధ్వంసం చేయడం సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ఉపేక్షించకూడదని ప్రభుత్వాన్ని కోరారు.